క్లుప్తంగా

మంచి చెడులపై అవగాహన కలిగి ఉండాలి



మాట్లాడుతున్న అర్బన్ సీఐ నరసింహులు

పులివెందుల టౌన్ : విద్యార్థులు మంచి చెడులపై అవగాహన కలిగి ఉండాలని అర్బన్ సీఐ నరసింహులు తెలిపారు. శనివారం స్థానిక బీసీ సంక్షేమ బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినులు చదువుపట్ల మంచి శ్రద్ధ వహిస్తూ మంచి, చెడులను తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేరాలపై నిఘా ఉంచండి



పోలీసులకు సూచనలిస్తున్న డీఎస్పీ మురళీ నాయక్

సింహాద్రిపురం : నేరాలపై నిఘా ఉంచాలని పులివెందుల డీఎస్పీ మురళినాయక్ పోలీసులకు సూచించారు. శనివారం బిదినంచర్ల వృద్ధురాలు హత్య విషయంలో పులివెందుల రూరల్ సీఐ వెంకటరమణ, ఎస్ఐ తులసీ నాగ ప్రసాద్‌లతో కలిసి ఆయన సంఘటనా స్థలాన్ని పరిశీలించి వెళ్లారు. త్వరలోనే నిందితులను పట్టుకుంటామని డీఎస్పీ తెలిపారు. అనంతరం పోలీస్‌స్టేషన్ ఆవరణలో మొక్కలను నాటి నీరు పోశారు.

సేవలు మరువలేనివి



విశ్రాంత అధ్యాపకులు, సిబ్బందితో కరస్పాండెంట్, ప్రిన్సిపాల్

పులివెందుల టౌన్ : లయోలా కళాశాలలో అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది సేవలు మరువలేనివని కరస్పాండెంట్ ఆంటోని స్వామి తెలిపారు. శనివారం స్థానిక లయోలా డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ జోజిరెడ్డి ఆధ్వర్యంలో పనిచేసి పదవీ విరమణ పొందిన అధ్యాపకులు, సిబ్బందికి సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కళాశాలకు వారు చేసిన సేవలను ఎన్నడూ లయోలా సంస్థ మరిచిపోదని, వారి సేవలను ప్రస్తుతం కళాశాలలో పని చేస్తున్న ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అనంతరం వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కళాశాల డెవలప్‌మెంట్ కమిటీ సభ్యులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆప్కాస్‌ను రద్దుచేస్తే కార్మికులను రెగ్యులర్ చేయాలి

జమ్మలమడుగు : రాష్ట్ర ప్రభుత్వం ఆప్కాస్‌ను రద్దుచేస్తే మున్సిపాలిటీ పరిధిలో పనిచేస్తున్న వారినందరిని రెగ్యులర్ చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు, సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ఎన్జీఓ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం దళారి వ్యవస్థ లేకుండా ప్రభుత్వమే ఆప్కాస్‌ను తీసుకుని వచ్చి అవుట్ సోర్సింగ్ కింద ఉద్యోగాలను ఇచ్చి క్రమం తప్పకుండా జీతాలు ఇస్తూ వచ్చారు. ప్రస్తుత ప్రభుత్వం ఈ ఆప్కాస్‌ను రద్దు చేసి దాని స్థానంలో కాంట్రాక్టు సిస్టంను తీసుకుని రావడం కోసం ప్రయత్నం చేస్తుందన్నారు. కార్యక్రమంలో కార్మిక నాయకులు మైఖేల్, కరిముల్లా, వినోద్‌లు పాల్గొన్నారు.

నివాళి



మరియమ్మ మృతదేహానికి నివాళులర్పిస్తున్న రవీంద్రనాథరెడ్డి

వల్లూరు (చెన్నూరు) : మండలంలోని కనపర్తి ఎస్సీ కాలనీ వైఎస్సార్ సీపీ నాయకుడు శ్యాంసన్ పెద్దమ్మ మరియమ్మ (58) శనివారం మృతిచెందిన విషయం తెలుసుకున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్ రెడ్డి మృతదేహానికి నివాళులర్పించారు.

ట్రాన్స్ జెండర్లకు కౌన్సెలింగ్



ట్రాన్స్‌జెండర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ పురుషోత్తంరాజు

వల్లూరు (చెన్నూరు) : మండలంలోని ఆలంఖాన్ పల్లె సర్కిల్ వద్ద కొంతమంది ట్రాన్స్ జెండర్స్ ద్విచక్ర వాహనాలలో వచ్చే వారిని బెదిరించి నగదు వసూలు చేస్తున్నట్లు పోలీసులకు సమాచారం రావడంతో చెన్నూరు సీఐ పురుషోత్తం రాజు ట్రాన్స్ జెండర్లను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ప్రధాన కూడళ్ల వద్ద ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలు చేసినా కఠినంగా శిక్షలు అమలు చేస్తామని హెచ్చరించారు.

ఉద్యాన పంటలవైపు రైతుల చూపు



రాగిమానుపల్లె సమీపంలో సాగు చేసిన ఖర్జూర పంట

- తక్కువ ఖర్చుతో అధిక ఆదాయం
- డ్రాగన్ ఫ్రూట్స్, ఖర్జూర పంటల సాగుపై రైతుల ఆసక్తి



కొత్తపల్లి గ్రామ సమీపంలో సాగు చేసిన డ్రాగన్ ఫ్రూట్ పంట

పులివెందుల రూరల్ : పులివెందుల ప్రాంత రైతులు ఉద్యాన పంటల వైపు ఆసక్తి కనబరుస్తున్నారు. మండల పరిధిలోని ఎర్రబల్లె పంచాయతీ కొత్తపల్లి గ్రామానికి చెందిన పుష్పనాథరెడ్డి 10 ఎకరాలలో డ్రాగన్ పంటను సాగు చేశాడు. రాగిమానుపల్లె పంచాయతీలో రైతు నరసింహారెడ్డి సుమారు 15 ఎకరాలలో ఖర్జూర పంట సాగు చేశాడు. పులివెందులకు చెందిన రైతు శ్రీనివాసులురెడ్డి సుమారు పది ఎకరాల్లో ఖర్జూర పంట సాగు చేశాడు. వీరు ఉద్యాన పంటలపై ఆసక్తి కనబరుస్తున్నారు.

ఆదాయం ఇచ్చే పంటల వైపు మొగ్గు

పులివెందుల ప్రాంతంలో ఎక్కువగా అరటి, చీని పంటలను సాగుచేస్తున్న రైతులు కొత్తగా డ్రాగన్ ఫ్రూట్స్, ఖర్జూర పంటలను సాగు చేస్తూ లాభాలు ఆర్జిస్తున్నారు. సేంద్రియ వ్యవసాయ పద్ధతుల ద్వారా పంటలను సాగు చేస్తూ లాభాలు గడిస్తున్నారు. పండ్ల తోటల పెంపకాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వాలు కూడా ఉపాధి హామీ పథకం ద్వారా నిధులు మంజూరు చేస్తున్నాయి. రైతులు కూడా తక్కువ కాలంలో పంట చేతికొచ్చే పంటలను సాగు చేసుకోవడం ద్వారా ఆర్థికంగా వెసులుబాటు ఉంటుందంటున్నారు. ఖర్జూర పంట ఏడాదికి ఒకసారి వచ్చినా మంచి దిగుబడి ఉండటంతో లాభాలు బాగానే వస్తున్నాయని రైతులు అంటున్నారు. అలాగే డ్రాగన్ ఫ్రూట్స్ కూడా ఏడాదికి ఒక పంట చేతికి రావడంతో మార్కెట్‌లో డ్రాగన్ ఫ్రూట్స్ కూడా మంచి గిరాకీ ఉంది. రైతులు చాలామంది ఉద్యానపంటలు సాగు చేసేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు.

ఆదాయాలు బాగానే ఉన్నాయి



గత ఐదేళ్లుగా కొత్తపల్లె గ్రామంలో డ్రాగన్ ఫ్రూట్ పంటను సాగు చేస్తున్నా. పంట మొదటిసారి పెట్టేటప్పుడు కొంత ఖర్చు వస్తుంది. తర్వాత లాభాలు బాగానే వస్తూ ఉంటాయి. సంబంధిత అధికారులు కూడా డ్రాగన్ ఫ్రూట్స్ సాగుపై రైతులకు అవగాహన కల్పించాలి.

– పుష్పనాథరెడ్డి, రైతు, పులివెందుల

5 ఎకరాల్లో ఖర్జూర పంట సాగు చేశా



నాకున్న 5 ఎకరాలలో ఖర్జూర పంటను సాగు చేశా. ఏడాదికొకసారి వచ్చే ఖర్జూర పంటవల్ల లాభాలు బాగానే ఉన్నాయి. ప్రతి ఏడాది పంటకు సరైన మోతాదులో ఎరువులు, మందులు వాడటం వల్ల కాపు బాగానే వస్తుంది. ప్రస్తుత కాలంలో చాలామంది రైతులు ఉద్యాన పంటలపై ఆసక్తి చూపుతున్నారు.

– సుధాకర్‌రెడ్డి, రైతు, పులివెందుల

ఉద్యాన కళాశాల విద్యార్థుల విజయకేతనం



క్రీడా పోటీలలో ప్రతిభ చూపిన విద్యార్థులతో అసోసియేట్ డీన్ నాగరాజు

పులివెందుల టౌన్ : డాక్టర్ వైఎస్సార్ హార్టికల్చరల్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన 11వ ఇంటర్ కాలేజ్ కాంపిటీషన్ క్రీడా పోటీలు అన్నమయ్య జిల్లా అనంతరాజుపేటలో జరిగాయి. ఈ పోటీలలో పులివెందుల డాక్టర్ వైఎస్సార్ హార్టికల్చర్ యూనివర్సిటీకి చెందిన 9 మంది విద్యార్థుల పాల్గొని ప్రతిభ చూపారని కళాశాల అసోసియేట్ డీన్ నాగరాజు తెలిపారు. కబడ్డీ పోటీలో రన్నర్స్‌గానూ, జావెలిన్ త్రోలో రెండవ స్థానం, జానపద గీతంలో మొదటి స్థానం, జానపద నృత్యంలో రెండవ స్థానం, తెలుగు ఉపన్యాసంలో మూడవ స్థానం, భరతనాట్య విభాగంలో రెండవ స్థానం, మిగతా అన్ని క్రీడా పోటీలలో నాలుగో స్థానంలో నిలిచారన్నారు. అలాగే భరతనాట్యం ప్రదర్శించిన తులసీ అందరి ప్రశంసలు పొంది జాతీయస్థాయికి వెళ్లిందన్నారు. అలాగే ముగ్గురు విద్యార్థులు కబడ్డీ విభాగంలో జాతీయస్థాయికి అర్హత సాధించారన్నారు. కార్యక్రమంలో అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రామాంజనేయరెడ్డి, పీఈటీ విష్ణుప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

ఢిల్లీ విజయం అవినీతి ప్రభుత్వాలకు చెంపపెట్టు



పులివెందులలో సంబరాలు చేసుకుంటున్న బీజేపీ నాయకులు

పులివెందుల టౌన్ : ఢిల్లీ ఫలితాలలో అరవింద్ కేజ్రీవాల్ నాయకత్వంలోని ప్రభుత్వం అవినీతితో కూరుకుపోవడంవలన ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన గుర్తు చీపురుతోనే ఆమ్ ఆద్మీ పార్టీని ఢిల్లీ ప్రజలు ఊడ్చి వేయడం జరిగిందని ఏపీ మార్క్‌ఫెడ్ రాష్ట్ర డైరెక్టర్ వి.శశిభూషణ్‌రెడ్డి, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ తేరా మహేశ్వర్‌రెడ్డిలు తెలిపారు. శనివారం పట్టణంలోని స్థానిక పూలంగళ్ల సర్కిల్ వద్ద బీజేపీ నాయకులు బాణా సంచా పేల్చి మిఠాయిలు పంచి ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాబోయే రోజుల్లో డబుల్ ఇంజన్ సర్కారు అన్ని రాష్ట్రాల్లో ఏర్పడుతుందన్నారు కార్యక్రమంలో రాష్ట్ర సాంస్కృతిక శాఖ విభాగం కన్వీనర్ భానుప్రకాష్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వేంపల్లెలో..

వేంపల్లె : ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలలో దాదాపు 27 ఏళ్ల తర్వాత భారతీయ జనతా పార్టీ అఖండ విజయం సాధించడం ఎంతో సంతోషంగా ఉందని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు రామచంద్రారెడ్డి తెలిపారు. శనివారం పట్టణంలోని 4 రోడ్ల కూడలిలో స్థానిక బీజేపీ నాయకులు బాణా సంచా పేల్చి, స్వీట్లు పంచి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆమ్ ఆద్మీ అనే పార్టీ అవినీతికి వ్యతిరేకంగా ఏర్పడిన పార్టీ, కానీ ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి, పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ వాల్ లిక్కర్ స్కాం అవినీతిలోనే కూరుకుపోయారన్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీ ఈ ఎన్నికల్లో ఒక్క సీటు కూడా గెలవలేదన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గాలిహరిప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షురాలు పెడపల్లి సుష్మ, జిల్లా వాణిజ్య అధ్యక్షుడు దొంతు సుమన్, రాష్ట్ర యువమోర్చా కార్యవర్గ సభ్యుడు సునీల్‌కుమార్, మండల అధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కమలాపురంలో..

కమలాపురం : ఢిల్లీ అసెంబ్లీ ఫలితాలు వెలువడిన అనంతరం బీజేపీ మండల అధ్యక్షుడు కిషోర్‌రెడ్డి, కార్యదర్శి ప్రశాంతిల ఆధ్వర్యంలో స్థానిక సీతా రామలయం వద్ద విజయోత్సవాలు జరుపుకున్నారు. బాణా సంచా పేల్చుతూ, డప్పు వాయిద్యాల నడుమ కార్యకర్తలు, అభిమానులు, బీజేపీ నాయకులు సందడి చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల ఉపాధ్యక్షుడు ఓబయ్య, తదితరులు పాల్గొన్నారు.

రెడ్డి సామాజిక వర్గంపై చేసిన అసభ్య పదజాలాన్ని ఖండిస్తున్నాం



డీఎస్పీ మురళీ నాయక్‌కు ఫిర్యాదు చేస్తున్న ఆర్‌సీడీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వై.సురేంద్రారెడ్డి

పులివెందుల టౌన్ : ఈనెల 2 తేదీన వరంగల్ బీసీ యుద్ధభేరి సభలో తీన్మార్ మల్లన్న అలియాస్ చింతపండు నవీన్ తన రాజకీయ స్వార్థం కోసం ఓసీలను ముఖ్యంగా రెడ్డి సామాజిక వర్గంపై చేసిన అనుచిత వ్యాఖ్యలను రెడ్డి కమ్యూనిటీ డెవలప్మెంట్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు సురేంద్రరెడ్డి తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. శనివారం డీఎస్పీ మురళీ నాయక్‌ను ఆయన కలిసి వినతిపత్రం అందించారు. చట్టబద్ధంగా 103వ రాజ్యాంగ సవరణ ద్వారా కల్పించిన 10 శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లపై చేసిన అనుచిత వ్యాఖ్యలన, ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ తొలగించాలని, రెడ్డిలపై అసభ్య పదజాలాన్ని వాడుతూ, రెడ్లంతా కుక్కల గుంపు, రెడ్లు మా మూత్రం తాగుతారని మాట్లాడటంపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని డీఎస్పీకి విన్నవించారు. ప్రతి రెడ్డి తన దగ్గరలో ఉన్న పోలీస్‌స్టేషన్‌లో తీన్మార్ మల్లన్నపై ఫిర్యాదు చేయాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో ఆర్‌సీడీఎస్ రాయలసీమ కన్వీనర్ చప్పిడి జగదీశ్‌రెడ్డి, శివలోకేష్‌రెడ్డి, రెడ్డి ప్రముఖులు పాల్గొన్నారు.

నులి పురుగుల నివారణతో వ్యాధులు దూరం



నులిపురుగుల నివారణ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైద్యులు

తొండూరు : నులిపురుగుల నివారణతో చాలా వ్యాధులు దూరమవుతాయని పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ అరిపుల్లా, డాక్టర్ రేష్మా తెలిపారు. శనివారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జాతీయ నులి పురుగుల నివారణ పోస్టర్లను వారు ఆవిష్కరించారు. ఈనెల 10వ తేదీన అన్ని విద్యా సంస్థలలోని 19 ఏళ్లలోపు విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను మింగించాలన్నారు. ఈ మాత్రలను ఏడాదికి రెండు సార్లు మింగించడం ద్వారా ఎలిక పాములు, నులి పురుగుల, కొంకి పురుగులను నివారించవచ్చునన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ మల్లయ్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

రేపు జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం

సింహాద్రిపురం : ఈనెల 10వ తేదీన సోమవారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ కృష్ణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. 19 ఏళ్లలోపు వారందరికి ఆల్బెండజోల్ మాత్రలను అందించాలన్నారు. పిల్లల్లో రక్తహీనత, బుద్ధిమాంద్యం వంటి సమస్యలను నివారించవచ్చునన్నారు. చదువుపట్ల ఏకాగ్రతను పెంపొందించవచ్చునన్నారు. మండల వైద్యాధికారులు, విద్యాశాఖ అధికారులు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు అందరూ సమన్వయంతో విద్యార్థులకు మాత్రలను పంపిణీ చేయాలన్నారు. బీసీ రుణాల కొరకు దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వము ఈనెల 12వ తేదీ వరకు గడువు పెంచిందన్నారు.

నేడు ఉచిత షుగర్ పరీక్షలు

పులివెందుల టౌన్ : పట్టణంలోని డాక్టర్ ఇసీ గంగిరెడ్డి ఆసుపత్రి(దినేష్ మెడికల్ సెంటర్)లో ఆదివారం ఉచిత షుగర్ పరీక్షలు నిర్వహించనున్నట్లు ఆసుపత్రి డాక్టర్ ఇసీ దినేష్‌రెడ్డి తెలిపారు. ప్రముఖ షుగర్ స్పెషలిస్ట్ డాక్టర్ వై.జి.హర్షవర్ధన్‌రెడ్డి ఉచిత షుగర్ పరీక్షలతోపాటు సలహాలు, సూచనలు ఇస్తారన్నారు. షుగర్ పరీక్ష చేయించుకోవాలనుకునే వారు పరగడుపున ఏమి తినకుండా రావాలన్నారు. ఈ అవకాశాన్ని షుగర్ సమస్యలతో బాధపడుతున్న వారు సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

ముగ్గురిపై కేసు నమోదు

సింహాద్రిపురం : మండలంలోని దిద్దికుంట గ్రామానికి చెందిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తులసి నాగప్రసాద్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. దిద్దికుంట్ల గ్రామానికి చెందిన రమాదేవి అదే గ్రామానికి చెందిన శైలజ ఇంటి వద్ద ఘర్షణ పడ్డారు. రమాదేవిపై శైలజ, రమేష్ అంకన్నలు దాడి చేసినట్లు ఆమె ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు

రోడ్డుకు మరమ్మతులు



కొత్తపల్లెలో మరమ్మతులు చేసిన రోడ్డు

సాక్షి ఎఫెక్ట్..

పులివెందుల రూరల్ : మండలంలోని ఎర్రబల్లె పంచాయతీ కొత్తపల్లి గ్రామానికి వెళ్లే రహదారి గుంతలమయంగా ఉండటంతో వారం రోజుల క్రితం సాక్షి దినపత్రికలో గుంతలు రోడ్డుతో అవస్థలు పడుతున్నాం అనే శీర్షికన వార్త ప్రచురితమైంది. దీనికి స్పందించిన ఆర్‌అండ్‌బీ అధికారులు కొత్తపల్లె గ్రామానికి వెళ్లే రహదారికి మరమ్మతులు చేశారు. గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ సాక్షికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

గీత కార్మికులకు మద్యం షాపుల్లో అన్యాయం

జమ్మలమడుగు : గీత కార్మికులకు మద్యం షాపుల కేటాయింపులో రాష్ట్ర ప్రభుత్వం తీరని అన్యాయం చేసిందని గీత కార్మిక నాయకుడు కె.క్రిష్ణమూర్తి గౌడ్ తెలిపారు. శనివారం స్థానిక పాత బస్టాండ్‌లో ఆయన మాట్లాడుతూ గీత కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం మద్యం షాపును పెద్దముడియం మండలంలో కేటాయించింది. అక్కడ ఇప్పటికే మద్యం షాపు నామమాత్రంగా నడుస్తుంది. అటువంటి ప్రాంతంలో గౌడ్‌లకు మద్యం షాపు కేటాయించడం సరైంది కాదన్నారు. ఆ ప్రాంతంలో మద్యం షాపు కేటాయించడంతో తాము టెండర్‌లో పాల్గొనలేదన్నారు. ప్రభుత్వం గౌడ్‌లకు కేటాయించిన మద్యం షాపును జమ్మలమడుగు పట్టణంలో కేటాయించాలని డిమాండ్ చేశారు.

గురుకులాల్లో అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకోండి

కమలాపురం : పేద, నిరుపేద ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థినీలకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 5వ తరగతి, ఇంటర్ ఫస్టియర్‌లో అడ్మిషన్ పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని స్థానిక గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ జి.తులసమ్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్ సెంటర్ల ద్వారా ఈ అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకోవాలని, లేని పక్షంలో తమ పాఠశాలలోనే ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేస్తామని ఆమె తెలిపారు. మార్చి 6వ తేదీ చివరి గడువు అని, 2025–26లో 5, 11 తరగతులు చదివే విద్యార్థుల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 9502442462, 9704668058 నెంబర్లకు సంప్రదించాలని ఆమె తెలిపారు.

ఘనంగా ముగిసిన విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు



సీతా, రామ, లక్ష్మణ మూలవిరాట్‌లు

వల్లూరు : మండలంలోని బాలుగారిపల్లెలో నూతనంగా నర్మించిన సీతా,రామ, లక్ష్మణ, హనుమత్సమేత రామాలయంలో మూడు రోజులుగా జరుగుతున్న విగ్రహ ప్రతిష్టా మహోత్సవాలు శనివారం ముగిశాయి. ఉదయం యంత్ర ప్రతిష్ట, విగ్రహ ప్రతిష్ట, ధ్వజ ప్రతిష్టా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ప్రాణ ప్రతిష్ట చేశారు. అనంతరం ప్రత్యేక వేదికపై సీతారాములను ఆశీనులను చేసి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు హాజరైన వైఎస్ఆర్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పీ రవీంద్రనాథరెడ్డి, ఏపీఎస్ ఆర్‌టీసీ మాజీ చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డిలను నిర్వాహకులు సన్మానించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

కల్పవృక్ష వాహనంపై శ్రీవేంకటరమణుడు



కల్పవృక్ష వాహనంపై సతీసమేత శ్రీవేంకటరమణుడు

పులివెందుల టౌన్ : పులివెందులలో వెలసిన శ్రీవేంకటరమణస్వామి ఆలయంలో జరుగుతున్న శ్రీవారి బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం ఐదవ రోజు వేంకటరమణుడు సతీసమేతుడై కల్పవృక్ష వాహనంపై కనువిందు చేశారు. అలంకరించిన ప్రత్యేక వాహనంలో కొలువుతీరిన స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. గ్రామోత్సవంలో పురవీధులలో భక్తులు గోవిందనామ స్మరణలతో తమ భక్తిని చాటుకున్నారు. స్వామి ఐదు శేషుల పడగలపై నాట్యం చేస్తున్నట్లు కనిపించే తీరు భక్తులను ఆకట్టుకుంది. మహిళలు స్వామివారి రథాన్ని లాగుతూ గోవిందా.. గోవిందా నామజపాలతో ముందుకు కదిలారు. భక్తులు కాయ, కర్పూరాలు సమర్పించి వేడుకున్నారు. ఆలయంలో సాయంత్రం స్వామి వారిని పల్లకిలో ఉంచి సహస్ర దీపాలంకరణ సేవ చేశారు. ఊయలలో స్వామి ఊగుతుంటే భక్తకోటి పులకించింది.

గంగమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ట



వైఎస్సార్‌సీపీ నాయకులు, మహిళలతో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

వేంపల్లె : మండలంలోని కుప్పాలపల్లెలో నూతనంగా నిర్మించిన తాళ్లపల్లె గంగమ్మ ఆలయంలో ఘనంగా విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం నిర్వహించారు. తాళ్లపల్లె గంగమ్మ విగ్రహ ప్రతిష్టతోపాటు ధ్వజస్తంభం, విమాన కలశ, పోతురాజు, సింహ వాహన నూతన విగ్రహ ప్రతిష్టా, కుంభాభిషేకం చేపట్టారు. కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ఆలయ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు ఆయనకు శాలువతో ఘనంగా సత్కరించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అలాగే చెక్కభజన, కోలాటం, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అకట్టుకున్నాయి. గంగమ్మ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు బంక సోమేశ్వరరెడ్డి, ప్రసాద్‌రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, రామగంగిరెడ్డి, కొత్తూరు రెడ్డయ్య, కుప్పాలపల్లె సర్పంచ్ లక్ష్మిదేవి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా బండలాగుడు పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న పీ రవీంద్రనాథరెడ్డి, అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి

వల్లూరు : మండలంలోని బాలుగారిపల్లెలో విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో భాగంగా శనివారం న్యూ కేటగిరీ విభాగంలో నిర్వహించిన బండలాగుడు పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో పలు జిల్లాల నుండి మొత్తం 11 జతల ఎద్దులు పాల్గొన్నాయి. ఈ పోటీలను వైఎస్ఆర్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పీ రవీంద్రనాథ రెడ్డి, ఏపీఎస్ ఆర్‌టీసీ మాజీ చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి ప్రారంభించారు. ఎస్ఎస్‌వీ బ్రీడర్స్, మల్లేల, విద్యా ఓబుల్ రెడ్డి రూకావారిపల్లె ఎద్దులు 4323 అడుగులు లాగి మొదటి రూ.50 వేలు, నంద్యాల జిల్లా అలగనూరుకు చెందిన రోలి మేడం ఎద్దులు 4150 అడుగులు లాగి రూ.40 వేలు, పెండ్లిమర్రి మండలం తిప్పిరెడ్డిపల్లెకు చెందిన విశ్వనాథ రెడ్డి ఎద్దులు 4099 అడుగులు లాగి రూ.30 వేలు, పెండ్లిమర్రి మండలం బాలయ్యగారిపల్లెకు చెందిన విష్ణువర్ధన్ రెడ్డి ఎద్దులు 4073 అడుగులు లాగి రూ.20 వేలు, కడప మండలంలోని ఖాదర్‌ఖాన్‌కొట్టాలుకు చెందిన భావన శ్రీ ఎద్దులు 3854 అడుగులు లాగి రూ.15 వేలు, ప్రొద్దుటూరుకు చెందిన తేజేశ్వర్‌రెడ్డి ఎద్దులు 3785 అడుగులు లాగి రూ.10 వేలను గెలుపొందాయి.

ఉత్సవాలను జయప్రదం చేయండి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దండు వీరయ్య మాదిగ

పులివెందుల రూరల్ : ఈనెల 12వ తేదీన జరిగే శ్రీమాతంగ మహర్షి శ్రీసంత్ రవిదాస్ జయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలని ఏపీ ఏమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య మాదిగ తెలిపారు. శనివారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో రవిదాస్ జయంతికి సంబంధించిన పోస్టర్లను ఆయన మాదిగ సోదరులతో కలిసి ఆవిష్కరించి మాట్లాడారు. ఈ ఉత్సవాల్లో మడకశిర ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు, లెడ్‌క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు, శ్రీమాతంగ మహా పీఠాధిపతుల నూకల రవీంద్ర స్వామిలు పాల్గొంటారన్నారు. అగ్రవర్ణాల ఆపోహలను తొలగించేందుకు మాదిగల చరిత్ర పుట్టు పూర్వత్రాలను సమాజానికి తెలియజేయడానికి ఈ జయంతి ఉత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో డప్పు చర్మకారుల రాష్ట్ర అధ్యక్షుడు కే నాగభూషణం, మాదిగ ఏపీ ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కృష్ణమూర్తి మాదిగ, దళితవాది జైశ్రీ రామాంజనేయులు మాదిగ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ వర్కర్లపై వేధింపులు ఆపాలి



యూనియన్‌లో చేరినవారితో మంజుల

ముద్దనూరు : అంగన్‌వాడీ వర్కర్లపై రాజకీయ నాయకుల, అధికారుల వేధింపులు ఆపాలని, వర్కర్ల సమస్యల పరిష్కారమే ఏఐటీయూసీ లక్ష్యమని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు మంజుల డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని యామవరంలో ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ వర్కర్లపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న విధానాలపై నిరంతరం పోరాడుతామని, బడ్జెట్‌లో ఐసీడీఎస్‌కు ఎక్కువ నిధులు కేటాయింపులపైన, అశాస్త్రీయమైన యాప్‌లపైన, వేధింపులు తదితర సమస్యలపైన పోరాడతామని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్‌లోకి 40 మంది సీఐటీయూ అంగన్‌వాడీ యూనియన్ కార్యకర్తలు, ఆయాలు చేరినట్లు మంజుల తెలిపారు.

ఏపీ కట్వా– 2025 క్యాలెండర్ల ఆవిష్కరణ



కట్వా క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న బలిజ సంఘ నాయకులు

వేంపల్లె : స్థానిక బలిజ సంఘం వీధిలో వెలసిన గౌరీదేవి ఆలయం వద్ద ఏపీ కట్వా–2025 క్యాలెండర్లను ఆవిష్కరించారు. శనివారం బలిజ సంఘం అధ్యక్షుడు నంబూరు కులాయప్ప ఆధ్వర్యంలో కట్వా జిల్లా అధ్యక్షుడు యనమల సుబ్రహ్మణ్యం, ప్రధాన కార్యదర్శి సునీల్‌కుమార్, కార్యవర్గ సభ్యులు ఆవుల శ్రీనివాసులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బలిజ సంఘీయులందరూ ఐక్యతగా ఉండి ఆలయ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కాట్వా సంఘం ప్రతినిధులు కోలా మారుతి ప్రసాద్, కటిక చంద్రశేఖర్, కోనేటి రామచంద్రన్, సభ్యులు రవికుమార్, గోవర్ధన్, విజయ్‌కుమార్, ఎడాల రామా, గోపాలకృష్ణ, నరేంద్ర రాయల్ తదితరులు పాల్గొన్నారు.

అప్రకటిత విద్యుత్ సరఫరా వేళల్లో మార్పు

లింగాల : మండలంలోని బోనాల, అక్కులగారిపల్లె, దొండ్లవాగు విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో మెయింటెన్స్ పేరుతో వ్యవసాయ విద్యుత్ సరఫరాను నిలిపివేశారని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆయా సబ్‌స్టేషన్ల పరిధిలోని రైతులకు విషయం తెలియజేయకుండా విద్యుత్ సరఫరాను నిలిపివేశారన్నారు. ఆయా సబ్‌స్టేషన్ల ఆపరేటర్లకు కూడా ఈ విషయాన్ని ఏఈలు తెలపలేదన్నారు. అదేవిధంగా లింగాల విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో తెల్లవారు జామున 4 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిరంతరాయంగా వ్యవసాయ విద్యుత్ సరఫరా అయ్యేదని, అలాంటిది శనివారం ఉదయం 8.30 గంటలకు విద్యుత్ సరఫరా ఇచ్చారన్నారు. ఇక నుంచి తెల్లవారు జామున 4 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు వ్యవసాయ విద్యుత్ సరఫరా చేయాలని సబ్ స్టేషన్ పరిధిలోని రైతులు కోరుతున్నారు.